ప్రజాశక్తి

సోమవారం 25 ఆగష్టు 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మతోన్మాదాన్ని ఎదుర్కోవాలంటే..

వామపక్షాలు బలపడక తప్పదు..

సిపిఐ రాష్ట్ర మహాసభల్లో నేతలు..

పేజీ ▲



పుస్తక మహోత్సవంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

'పుస్తక మహోత్సవం'

విజయవంతం

నిర్వాహకులను అభినందించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విఎస్ఆర్

5పేజీ ▲

మరమ్మతులకు నోచని చెరువు కట్ట

ప్రజాశక్తి-పుల్లలచెరువు


చిన్న కల్లేరు చెరువు

పుల్లలచెరువు గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న చిన్న కల్లేరు చెరువు కట్ట మరమ్మతులకు నోచుకోలేదు. 1970వ సంవత్సరంలో ఈ చెరువు కట్ట నిర్మించారు. దీనినే కొత్తచెరువు అని కూడా అంటారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు పుల్లలచెరువు, తెల్లగట్ల, రెంటపల్లి, పలు గ్రామాల రైతులు ఈ చెరువు నీరుతో పంటలు పండించేవారు. రాను రాను వర్షాభావం తగ్గటంతో ఆ చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులు పంటలు వేసి పండించేవారు. 2022లో చిన్న కల్లేరు చెరువు కట్టకు గండిపడి వృథాగా నీరు పోతుందని పలు పత్రికలలో వచ్చిన కథనానికి ఆనాటి మంత్రి ఇరిగేషన్ శాఖ అధికారులను హెచ్చరించారు. నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన మంత్రి నేరుగా చిన్న కల్లేరు చెరువు కట్టను సందర్శించారు. అయినా అప్పటి అధికారులు తూతూమంత్రంగా ఆ గండికి మట్టిపోసి మమ అనిపించారు. ఇప్పుడు చెరువులో పది అడుగుల మేర నీరు ఉన్నది. కట్టకు ఇరువైపులా ముళ్ల కంప పెరిగి కట్ట కనిపించకుండా మూసుకుపోయింది. అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులు వెలిగొండ నీళ్లు పుల్లలచెరువు, చిన్నకల్లేరు చెరువుకు వచ్చే విధంగా చూస్తామని పలు సందర్భాల్లో చెప్పినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. వెలుగొండ నీళ్లు పుల్లలచెరువు చిన్న కల్లేరు చెరువుకు ఎప్పుడు వస్తాయో తెలియదు కానీ ఎక్కువ వర్షపాతం కురిసింది అంటే చెరువు కట్ట తెగటం ఖాయమని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిన్నకల్లేరు చెరువు కట్టకు మరమ్మతులు చేయించి కట్ట పటిష్టంగా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కట్ట మరమ్మతులు చేయాలి

మేడికొండ రాఘవరావు, రైతు, పుల్లలచెరువు

చిన్న కల్లేరు చెరువు కట్ట చాలా ఏళ్ల నుంచి మరమ్మతుకు నోచుకున్న విషయం అందరికీ తెలిసిన విషయమే. ఉన్నతాధికారులు స్పందించి ఈ కట్టను దృష్టిలో పెట్టుకొని మరమ్మతులు చేయించాలి.

గండిని శాశ్వతంగా పూడ్చాలి

మందలపు రాములు, రైతు, పుల్లలచెరువు

చిన్న కల్లేరు చెరువు కట్టకు గండిపడి చాలా రోజులైంది. అప్పటి నాయకులు గండికి మట్టి పోశారు. కానీ పెద్ద వర్షం కురిసి చెరువుకి అధిక నీరు వస్తే చెరువు కట్ట తెగే ప్రమాదం ఉంది కాబట్టి దీని దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు మరమ్మతులు చేయాలి.

తాగటానికి వాగు నీరే దిక్కు

ఇబ్బంది పడుతున్న ఇష్టకామేశ్వరి చెంచుగూడెం గిరిజనులు • అధికారులు స్పందించాలని వినతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అరణ్యంలో నివసిస్తున్న చెంచు గిరిజనుల జీవన పరిస్థితులు మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఇష్టకామేశ్వరి చెంచు గూడెంలో నివసిస్తున్న 36 కుటుంబాలు తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మంచినీరు లభించక గత్యంతరం లేక వాగు నీరు తాగుతూ కాలం గడుపుతున్నామని చెవుల నాగమల్లు ఆదివారం యర్రగొండపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేత..

గిరిజనుల తాగునీటి అవసరాల కోసం అటవీశాఖ అధికారులు గతంలో ప్రతిరోజూ రెండు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేవారని తెలిపాడు. అయితే ఇటీవల ఆ సరఫరా పూర్తిగా నిలిచిపోయిందన్నాడు. ఫలితంగా చెంచుగిరిజనులు తాగటానికి వాగు నీటి పైనే ఆధారపడుతున్నారని వాపోయారు. వాగు నీరు తాగడం వలన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లలు చిన్న వయసులోనే ఈ దుష్పరిణామాలకు గురయ్యే ప్రమాదం ఉంది అని చెవుల నాగమల్లు ఆవేదనతో తెలిపాడు.

బోర్లు లేక ఇబ్బందులు..

ఇష్టకామేశ్వరి చెంచుగూడెంలో ఒక్క బోరు కూడా లేకపోవడం సమస్యను మరింత విషమం చేస్తోంది. ట్యాంకర్ల సర ఫరా ఆగిపోయినా, కనీసం బోర్లు ఉంటే తమకు తాగునీటి కోసం వేదన ఉండేది కాదు అని చెంచులు ఆవేదన చెందుతున్నారు. బోర్లు లేని కారణంగా వాగు నీరే ప్రధాన ఆధారంగా మారిపో యిందని, ఇది శాశ్వత పరిష్కారం కాదని వారు పేర్కొన్నారు.

రాత్రిపూట విష జంతువుల భయం..

తాగునీటి సమస్యతో పాటు, విద్యుత్ లేని ఈ అరణ్య గూడెంలో సోలార్ లైట్లు కూడా పనిచేయకపోవడం మరో పెద్ద సమస్యగా మారింది. గతంలో ఈ గూడెంలో సోలార్ లైట్లు అమర్చారు. అవి చెడిపోయిన తర్వాత మరమ్మతు చేయలేదు. రాత్రిపూట చీకట్లో విషపూరిత జంతువుల భయం తమను ఎప్పుడూ వెంటాడుతోంది అని నాగమల్లు వాపోయారు. పిల్లలు, మహిళలు రాత్రిపూట బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారని, లైట్లు లేనందువల్ల ప్రమాదాలు ఎక్కువయ్యే అవకాశముందని ఆయన చెప్పారు.

అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా ఉన్నతాధికారులు మా గూడెంపై కనికరించాలి. ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలి. అలాగే సోలార్ సిస్టంతో బోరు ఏర్పాటు చేసి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలి అని నాగమల్లు కోరారు. సోలార్ లైట్లను తక్షణమే మరమ్మతు చేసి రాత్రిపూట గ్రామస్తులు విషజంతువుల బారిన పడకుండా రక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అడవిలో నివసిస్తున్న ఈ చెంచు గిరిజనులకు ఆధునిక సౌకర్యాలు అందకపోవడం కొత్త విషయం కాదు. రోడ్లు లేక, వైద్య సదుపాయాలు లేక, విద్యుత్ సరఫరా లేక జీవనం సాగిస్తున్న గిరిజనులకు తాగునీటి సమస్య ఇప్పుడు మరింత కష్టాలను తెచ్చిపెడుతోంది. అధికారులు ఏటా పథకాలు ప్రకటిస్తున్నప్పటికీ, గూడెం ప్రజల జీవన స్థితి మాత్రం మారడం లేదు. మాకు ప్రభుత్వం ఉన్నదా, లేదా అన్న సందేహం కలుగుతోంది. మా సమస్యలు విని పరిష్కరించకపోతే తాము బతకలేమని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న నాగమల్లు

బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో బార్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రకాశం, బాపట్ల జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె హేమంత్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఆయన బార్ లైసెన్స్ అభ్యర్థులు, పాత ఏ4 దుకాణ లైసెన్స్ హెూల్డర్లు, ప్రస్తుత ఏ4 దుకాణ లైసెన్స్ హోల్డర్లు, రెస్టారెంట్ల యజమానులు, డాబా యజమానులతో మాట్లాడారు. 2025-28 నూతన బార్ పాలసీ విధానం గురించి వారికి వివరించారు. కొత్త పాలసీ విధానం ద్వారా ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బార్లు తెరిచి ఉంచుకోవచ్చని తెలిపారు. బార్ కోసం ఈ నెల 26 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. 28న సాయంత్రం లాటరీ తీసి బార్ కేటాయించనున్నట్లు తెలిపారు. బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు దరఖాస్తు ఫీజు రూ.5,00,000 (ఐదు లక్షలు)తో పాటు ప్రాసెసింగ్ ఛార్జీలు రూ.10,000ను చలానా రూపంలో చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. అలాగే పట్టణంలో బార్ లైసెన్స్‌కు మరిన్ని దరఖాస్తులు రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గిద్దలూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం జయరావుకు ఆదేశాలు జారీ చేశారు.


మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్

కుక్కల స్వైర విహారం.. ప్రజల బెంబేలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎక్కడ చూసినా వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న వీటి కారణంగా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్లపై ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు మాత్రమే కాకుండా పశువులు కూడా వీటి దాడికి గురవుతున్నాయి.

ప్రతి నెలా వందకుపైగా కేసులు..

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల గణాంకాల ప్రకారం ప్రతి నెలా 60 నుంచి 100 మందికి పైగా కుక్క కాటుకు గురవుతున్నారు. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రికి మాత్రమే కాకుండా ప్రైవేట్ ఆసుపత్రులను కూడా ఆశ్రయిస్తున్నారు. అంటే అసలు సంఖ్య మరింత ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్లపై కుక్కల గుంపులు..

యర్రగొండపాలెం పట్టణంలోని తెల్లవారగానే పట్టణంలోని ప్రధాన వీధులు, రహదారులపై కుక్కలు మందలుగా తిరుగుతుంటాయి. ద్విచక్ర వాహనాలపై వెళు_న్న వారిని వెంబడించి కరవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, విధుల నిమిత్తం బయలుదేరే ఉద్యోగులు, వృద్ధులు ఎప్పుడెప్పుడు కుక్క దాడి జరుగుతుందోనని వణికిపోతున్నారు.


వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

పశువులపై దాడులు..

ప్రజలతో పాటు పశువులు కూడా కుక్కల దాడికి గురవుతున్నాయి. దూడలు, మేకలు, గొర్రెలను కరచి వాటిని మరణానికి గురిచేస్తున్న ఘటనలు నమోదవుతున్నాయి. ఇటీవల కుక్కల దాడిలో కొన్ని దూడలు, గొర్రెలు మరణించాయి. దీంతో రైతులు, కాపరులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నియంత్రణలో విఫలమవుతున్న అధికారులు..

కుక్కల సంఖ్య అదుపు తప్పిపోతున్నప్పటికీ, సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించే పరిస్థితి కూడా లేదని, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని పలువురు వాపోతున్నారు. చికెన్ షాపుల వద్ద ఎక్కువగా కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలకు భయాందోళన కలిగిస్తున్నాయి.

నియంత్రణ చర్యలేవీ

షేక్ పెద్ద వలి, యర్రగొండపాలెం



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగు తున్నాయి. ముఖ్యంగా చికెన్ షాపుల వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీటిని చూస్తేనే భయమేస్తోంది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

కుక్క కరిస్తే అశ్రద్ధ చేయకూడదు

డాక్టర్ దేవర యదిద్యా, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్



కుక్క కరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యశాలకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవాలి. రేబీస్ వ్యాధి బారిన పడకుండా మేము ప్రతి రోగికి ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తున్నాము. ఏరియా వైద్యశాలలో రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

ప్రజాశక్తి
3
సోమవారం 25 ఆగస్టు 2025

రూ.10 కోట్లు ఖర్చు ఒక కుటుంబమే నివాసం

పూర్తిస్థాయిలో వసతులు కల్పించని వైనం -బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిన ఇళ్ల నిర్మాణం

నివాసానికి ముందుకు రాని లబ్ధిదారులు - ఇదీ దర్శి జగనన్న కాలనీలో పరిస్థితి



దర్శిలోని జగనన్నకాలనీ లేఅవుటు

ప్రజాశక్తి-దర్శి

రూ.10 కోట్లు ఖర్చు చేసి జగనన్న కాలనీ పేరుతో లే అవుట్లు వేశారు. వసతులు పూర్తి స్థాయిలో కల్పించక పోవడం, కాలనీ పట్టణానికి దూరంగా కొండ ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకవడంలో వెనుకడుగు వేశారు. కొన్ని ఇళ్లు నిర్మాణం పూర్తయినా కొండ ప్రాంతం కావడంతో, ఒంటరిగా ఉండలేక నివాసం ఉండ టానికి ముందుకు రాలేదు. కోట్లు ఖర్చు చేసిన వేసిన జగ నన్న కాలనీల ప్రస్తుతం ఒక్క కుటుంబం మాత్రమే నివాసం ఉంటోంది. ఇది దర్శి పట్టణంలోని జగనన్న కాలనీ దుస్థితి.



శ్లాబులు వేయకుండా వదిలేసిన ఇల్లు

గత వైసీపీ హయాంలో దర్శి నగర పంచాయతీ పరిధిలోని లంకోజనపల్లి పంచాయతీలో చలివేంద్ర కొండ సమీపాన జగనన్న లేఅవుట్ల పేరుతో దర్శి పట్టణంలోని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలలు మంజూరు చేశారు. రెండు లే అవుట్లలో 2518 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు కాగా ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు వచ్చిన లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేశారు. ఈఎల్ బి/1లో 2168 పేదలకు పట్టాలు మంజూరు చేయగా అందులో 413 మందికి గృహ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశారు. వాటిలో 238 బేస్‌మెంట్ లెవెల్, 3 లెంటర్ లెవెల్‌లో, 29 స్లాబ్ లెవల్‌లో ఉండగా 91 పూర్తయ్యాయి. అదేవిధంగా ఈ ఎల్ బి/2లో 350 మందికి గృహాలు మంజూరు కాగా 76 బేస్‌మెంట్ లెవెల్, 55 లింటల్ లెవెల్, 6 శ్లాబ్ లెవెల్‌లో ఉండగా 12 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అయితే ఇందులో ఒక్క కుటుంబం మాత్రమే ఇల్లు పూర్తి చేసుకొని స్థానికంగా ఉంటున్నట్లు స్థానిక ఏ అక్బర్ బాషా తెలిపారు.

అప్పట్లో ప్రభుత్వ భూమిని చదును చేయడానికి, లేఅవుట్లు వేయడానికి, విద్యుత్తుకు, మంచినీటికి పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు రెండింటికి కలిపి దాదాపుగా రూ.10 కోట్ల వరకు ఖర్చుపెట్టారు. కానీ కాలనీలో సరియైన రహదారులు లేవు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా లైట్లు బిగించలేదు. నీటి సరఫరా లేదు. ఈ కారణంతో కాలనీలో ఇళ్లు పూర్తి చేసుకొని స్థానికంగా నివాసం ఉండటానికి లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈలోపు ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే దర్శిలో ఎంతోమంది అర్హులైన పేదలు ఇల్లు లేక ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కానీ ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అక్కడ ఆ రెండు లేఔట్‌లో పూర్తిస్థాయిలో రోడ్లు వేసి, లైట్లు బిగించి విద్యుత్తును సరఫరా చేసి మంచినీటి కుళాయిలు వేస్తే బిగించినట్లయితే అక్కడ పూర్తయిన దాదాపుగా 92 కుటుంబాలు అక్కడ నివాసాలు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ లేఔట్ మీద శ్రద్ధ పెట్టి పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

శింగరాయకొండలో మహిళ హత్య


ఉలిక్కి పడిన అంబేద్కర్ నగర్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ ఆదివారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. చెరుకూరి సుబ్బాయమ్మ (57)ని శనివారం రాత్రి హత్య చేసి ఇంట్లో ఉన్న నగదు, ఒంటి మీద ఉన్న బంగారాన్ని దోచుకుపోయిన సంఘటన జరిగింది. ఇంటి పక్కన మహిళలు ఇంకా లేవలేదని వెళ్లి చూడగా మంచం మీదే మృతి చెంది ఉండడాన్ని గమనించారు. ఇంటి తలుపులతో పాటు బీరువా కూడా తెరిచే ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఎస్ఐ బి.మహేంద్ర, సీఐ సిహెచ్.హజరత్తయ్య ఘటనా స్థలాన్ని పరిశీలిలంచారు. సుబ్బాయమ్మది కందుకూరు మండలం మహాదేవపురం కాగా భర్తతో విడిపోయి సుమారు 15 సంవత్సరాల క్రితం ఒంటరిగా వచ్చి శింగరాయకొండలోని అంబేద్కర్ నగర్లో స్థలం తీసుకొని ఇల్లు నిర్మించుకొని ఒంటరిగా జీవిస్తోంది. గతంలో పెరల్ డిస్టలరీలో చేసింది. ప్రస్తుతం చేపల మార్కెట్ దగ్గర టీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తోంది. ఈమె స్థానికులకు వడ్డీకి డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హత్య జరిగిందా? లేకపోతే దొంగతనమే కారణమా? అని పోలీసులు విచారణ చేస్తున్నారు. హత్య చేసి డబ్బులు, బంగారం తీసుకుపోయిన వ్యక్తులు ఆమె సెల్‌ఫోన్ కూడా తీసుకుపోవటంతో పోలీసులు ఆ సమయంలో అక్కడికి వచ్చిన టవర్ డంపు వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హత్య చేయబడ్డ సుబ్బాయమ్మ నివాసాన్ని పరిశీలించారు. డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ చెరుకూరి సుబ్బాయమ్మ హత్యకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామన్నారు. కొందరి అనుమానితుల్ని ఇప్పటికే అదుపులోకి తీసుకొని పూర్తి వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. మంగళగిరి నుంచి ఫోరెన్సిక్ ల్యాబ్ బృందం ఆదివారం సాయంత్రం సుబ్బాయమ్మ మృతదేహాన్ని పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు. సీఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



యోగాసనం వేస్తున్న స్వర్ణ రమణయ్య

జాతీయ యోగా పోటీలకు స్వర్ణ రమణయ్య

ప్రజాశక్తి-పీసీపల్లి : జాతీయ స్థాయి యోగాసనం పోటీలకు మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య ఎంపికయ్యారు. ఆగస్ట్ 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలలో స్వర్ణ వెంకట రమణయ్య రాష్ట్రస్థాయి యోగాసన పోటీలలో ప్రతిభ చూపి హ్యాండ్ బాలన్స్ ఆసనాలలో సిల్వర్ మెడల్, సుపైన్ ఆసనాల్లో బ్రోంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి యోగ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయికి ఎంపికైన రమణయ్యను మండల విద్యాశాఖ అధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ పతంజలి యోగ పీఠం అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

'నల్లబర్లీ' కొనుగోలు చేయాలని నిరసన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నల్లబర్లీ పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని కోరుతూ ఆదివారం రైతుసంఘం ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటరులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావులు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రయివేట్ కంపెనీలు రైతులను ప్రోత్సహిస్తూ ఎంత పొగాకు పంట సాగు చేసినా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి తీరా పంట చేతికి వచ్చిన తరువాత చేతులెత్తేయడంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో పడిందన్నారు. రైతుసంఘాల నిరసనతో దిగొచ్చిన ప్రభుత్వం చివరి ఆకువరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం గోడౌన్‌లు ఖాళీగా లేవన్న సాకుతో కొనుగోలు నిలిపేశారన్నారు. పొగాకు అమ్ముడు పోక కూలీలకు కూడా డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో రైతాంగం కొట్టుమిట్టాడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఇచ్చిన హామీ ప్రకారం రైతుల వద్ద ఉన్న బర్లీపొగాకును చివరి ఆకువరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా వర్జీనీయా పొగాకు లోగ్రేడ్‌ను రూ.20 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలన్నారు. లేనిచో పొగాకు రైతాంగాన్ని ఏకం చేసి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు టి.శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, రావెళ్ళ వెంకట్రావు, నాగేశ్వరరావు, గడ్డం ఏలియ్య, పాలపర్తి యోనా, హజరత్తయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు

ముఖాముఖి

బీసీ విద్యార్థుల సాధికారతే లక్ష్యం

- జిల్లా బిసి సంక్షేమం, సాధికారత అధికారి ఎస్.నిర్మలా జ్యోతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



వెనుకబడిన తరగతుల విద్యార్థుల విద్య, ఉపాధి, స్వయం సాధికారతలో అభివృద్ధి చెందాలన్న లక్ష్య సాధన కోసం బిసి సంక్షేమ శాఖ కృనిశ్చయంతో కృషి చేస్తోందని ప్రకాశం జిల్లా బిసి సంక్షేమం, సాధికారత అధికారి ఎస్.నిర్మలా జ్యోతి తెలిపారు. దీనిలో భాగంగా వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల కోసం ఉపకార వేతనాలు, బిసి స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ, సహకార సంఘాల రిజిస్ట్రేషన్ వంటి పథకాలను మరింత బలోపేతం చేసి బిసి విద్యార్థుల భవితను తీర్చిదిద్దేందుకు జిల్లాలో ప్రణాళికా బద్ధమైన కృషి జరుగుతుందన్నారు. ప్రకాశం జిల్లా బిసి సంక్షేమం, సాధికారత అధికారి ఎస్.నిర్మలా జ్యోతి ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

వసతి గృహాల సౌకర్యాలు మెరుగు పరుస్తున్నాం

ప్రకాశం జిల్లాలో మొత్తం 66 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 50 ప్రీమెట్రిక్ వసతి గృహాలు (బాలురు 40-బాలికలు 10) వీటిలో 27 వసతి గృహాలు ప్రభుత్వ భవనాల్లో, 23 ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి. అదనంగా 16 కాలేజ్ వసతి గృహాలు (ప్రతి నియోజకవర్గానికి ఒక బాలుర, ఒక బాలికల వసతి గృహం) ఉన్నాయి. వీటిలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాం. ప్రభుత్వం రూపొందించిన మెనూ తప్పకుండా పాటిస్తున్నాం. విద్యార్థులు చదువుతో పాటు సౌకర్యవంతమైన వాతావరణంలో ఉండాలి. అందుకే అద్దె భవనాలను కూడా ఎంపిక చేసి నిర్వహిస్తున్నాం. ఇన్‌మేట్స్ ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతోంది. విద్యార్థుల కులం, ఆర్థిక స్థితి, చదువులో అర్హత ఆధారంగా ప్రవేశం కల్పిస్తాం.

బిసి స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు శిక్షణ..

మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్‌ను పాత రిమ్స్ భవనంలో ప్రారంభించాం. ఇక్కడ బిసి, ఎస్సీ, ఎస్టీ, ఈబిసి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం. కోచింగ్‌లో సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్ పాల్గొంటారు. డీఎస్సీ, గ్రూప్స్ వంటి వాటికీ శిక్షణ ఇచ్చాము, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది చాలా ఉపయోగపడుతోంది. రేషియో ప్రకారం ప్రతి వర్గానికి సీట్లు కేటాయిస్తాం.

బిసి కులాల సహకార సంఘాల రిజిస్ట్రేషన్..

జిల్లాలో ఇప్పటికే అనేక సంఘాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాయి. ముఖ్యంగా రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, బట్రాజు,, కృష్ణ బలిజ, వాల్మీకి/బోయ, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి/శాలివాహన, మేదర, నగర/ఉప్పర, కల్లు/గీతకార్మికుల సంఘాలకు రిజిస్ట్రేషన్ ఇచ్చాం. వీటి ద్వారా సభ్యులు రుణాలు పొందడానికి, ప్రభుత్వ సహాయం పొందడానికి అవకాశం ఉంటుంది.

రూ.2330.63 లక్షల ఉపకార వేతనాలు విడుదల..

జిల్లాలో 27,838 మంది విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరపు మొదటి క్వార్టర్ ఉపకారవేతనాలు రూ.2330.63 లక్షలు విద్యార్థుల అకౌంట్లలో జమ చేసాము. వారిలో14,543 బిసి విద్యార్థులకు రూ.1061.41 లక్షలు,10,772 ఈబిసి విద్యార్థులకు రూ.1054.79 లక్షలు, 2,513 కాపు విద్యార్థులకు రూ. 211.43 లక్షలు విడుదల చేసాము. మొదటి త్రైమాసికానికి ఈ మొత్తం ఇప్పటికే విడుదలైంది. విద్యార్థుల ఫీజులు, మెస్ ఛార్జీలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకున్నాం.

బిసి విద్యార్థులు అవకాశాలు అంది పుచ్చుకోవాలి..

బిసి విద్యార్థుల విద్యా ప్రగతి పెరుగుతోంది. వసతి గృహాల ద్వారా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పట్టణాలలో చదువుకునే అవకాశం కలుగుతోంది. స్టడీ సర్కిల్ వల్ల పోటీ పరీక్షలకు అర్హత సాధించే అవకాశం పెరుగుతోంది. స్కాలర్‌షిప్‌ల వల్ల ఆర్థిక భారమూ తగ్గుతోంది. బిసి విద్యార్థులు, యువత ఈ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలి. చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రతి కుటుంబం తెలుసుకోవాలి. మా శాఖ తరపున ఎవరికి అవసరమైనా సహాయం అందించడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

డీఎస్సీలో ప్రతిభ చాటిన తండా వాసులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



భూక్య అంజమ్మ భాయి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలం లోని నాగరాజుపల్లి తండాకు చెందిన భూక్యా రవీంద్ర, భూక్యా విజయ్ కుమార్ నాయక్, జశావత్ అంజలి నాయక్, కేళావత్ కుమార్ నాయక్, జశావత్ ఆంజనేయులు ప్రతిభను చాటారు. డీఎస్సీ, సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన భూక్య అంజమ్మ భాయి ఉత్తమ ర్యాంకులు సాధించి తమ గ్రామానికి వన్నె తెచ్చారని గ్రామస్థులు పేర్కొన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఉపాధ్యాయులుగా ఎంపిక అవడం పట్ల ఎంఈఓ సిహెచ్ వస్త్రం నాయక్ అభినందనలు తెలిపారు.



కామ్రేడ్ సత్యమూర్తికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కామ్రేడ్ సత్యమూర్తి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - చీరాల

ఎపి ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) చీరాల బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మేడికొండ సత్యమూర్తి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడారు. సత్యమూర్తి అకాల మరణం ఐఎల్‌టిడి కార్మిక ఉద్యమానికి తీరని లోటని అన్నారు. గత 25 ఏళ్లుగా కంపెనీలో కార్మికునిగా పనిచేస్తూ ఫెడరేషన్ నాయకత్వంలో ఉన్నారని తెలిపారు. కంపెనీ కార్మిక ఉద్యమానికే కాకుండా సమాజ మార్పు కోసం ఆయన నిస్వార్థంగా కృషి చేశారని అన్నారు. కార్మిక వర్గం పోరాటాలతో సాధించిన హక్కులను మోడీ ప్రభుత్వం రద్దు చేసే పరిస్థితుల్లో కామ్రేడ్ మరణం తీవ్ర లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్దామని అన్నారు. సిఐటియు అధ్యక్షుడు ఎన్ బాబురావు మాట్లాడుతూ సత్యమూర్తి మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని, స్వప్రయోజనాలకన్నా సమాజ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చి కృషి చేశారని అన్నారు. ముందుగా సత్యమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభకు బోయిన పోతురాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సిఐటియు కార్యదర్శి జి సుధాకర్, కుందుర్తి నీలాంబరం, తిరుమలరావు, రతన్ రాజు, కిరణ్, ఎం నాగరాజు, ఉసురుపాటి అనిల్, కోశాధికారి నక్కల నాగరాజు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో యజ్ఞ ఆస్పత్రి వైద్యులు

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక యజ్ఞ హాస్పిటల్ సౌజన్యంతో మండలంలోని కాకుమానులో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిభిరంలో 250 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. యజ్ఞ ఆస్పత్రి జనరల్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో ఉచితంగా రక్తపోటు, షుగర్, ఈసిజి, ఎక్స్‌రే, బిపి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ మాధవి బెల్లంకొండ (రేడియాలజిస్ట్), డాక్టర్ బి పవన్ కుమార్ (ఎముకలు, కీళ్ళ నిపుణులు) పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి - వేమూరు

వ్యవసాయంలో చేసిన అప్పులు తీరక వరద ముంపుకు గురై పంటలు నష్టపోవడతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఈడుపుగంటి మురళీకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లూరు మండలం పోతార్లంక గ్రామంలో అప్పుల బాధ తట్టుకోలేక ఈనెల 17న కౌలు రైతు మురళీకృష్ణ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి శనివారం మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కౌలు రైతు సంఘం, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో అధిక శాతం పంటలు కౌలు రైతులే సాగు చేస్తున్నారని అన్నారు. అలాంటి కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయడంలో కానీ, ఇచ్చిన కార్డులకు బ్యాంకుల నుండి రుణాలు ఇప్పించడంలో గాని నిర్లక్ష్యం వహించడం వలన కౌలు రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల వద్ద రుణాలు తీసుకున్నారని అన్నారు. పంటలు పండక అప్పులు సకాలంలో చెల్లించలేకపోవడంతో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఓ పక్క వేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాలు, వరదలకు దెబ్బతింటుండగా మరోపక్క పండిన పంటకు గిట్టుబాటు ధర లేక కౌలు రైతులు మరింత నష్టాల ఊబిలోకి నెట్టబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులు, రైతుల ఆత్మహత్యలకు పరోక్షంగా బ్యాంకులు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. బ్యాంకులో రుణం పొందాలంటే తప్పని సరిగా రైతు అనుమతి ఉండాలని చెప్పటం, అక్కడక్కడ అరకొర రాయితీలు మాత్రమే అందిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని ఆగ్రహ వ్యక్తం చేశారు.



కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరిబాబు

మురళికృష్ణ కుటుంబ అప్పులు ప్రభుత్వమే రద్దు చేయాలి

ఆత్మహత్యకు పాల్పడిన మురళికృష్ణకు ఉన్న బ్యాంకు అప్పులను ప్రభుత్వం రద్దుచేసి ప్రైవేటు అప్పులు కూడా మృతుని కుటుంబంపై ఒత్తిడి లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం నుండి అందాల్సిన రూ.7 లక్షల పరిహారం ఎలాంటి సాకులు చూపకుండా కుటుంబానికి అందజేయాలని డిమాండ్ చేశారు. మురళీకష్ణ పిల్లలకు ప్రభుత్వమే కార్పొరేటు పాఠశాలలో చేర్పించి ఉచిత విద్యా బోధన చేయించాలని కోరారు. పి4 కార్యక్రమం ద్వారా కౌలు రైతు పిల్లలను దత్తత తీసుకుని చదివించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుండి అందించాల్సిన పరిహారం పూర్తిగా అందే విధంగా స్థానిక నాయకులు, అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. బాధిత కుటుంబానికి కౌలు రైతు సంఘం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్రా మాల్యాద్రి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోళ్ళ నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు తోడేటి సురేష్, బి సుబ్బారావు, పి నాగమల్లేశ్వరరావు, పిల్లి మరియారావు, స్థానికులు ఈడుపుగంటి కుటుంబరావు, సోడాబతుని మాణిక్యరావు, మద్దూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి

- రాష్ట్ర పరిశీలకులు, మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి
- విస్తృత స్థాయి సమావేశంలో మంత్రుల పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాని రాష్ట్ర పరిశీలకులు, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఒంగోలు పిఎజి ఫంక్షన్ హాలులో టిడిపి ఒంగోలు పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత టిడిపి పతాకాన్ని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పరిశీలకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి అధ్యక్షత వహించారు. సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు వైసిపి నాయకులకు కనపడటం లేదని విమర్శించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. తెలుగుదేశం కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించుకొని సిఎం చంద్రబాబు నాయుడు గౌరవిస్తున్నారని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు, సచివాలయాలు వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ తెలుగుదేశంను క్షేత్ర స్థాయి నుంచి మరింత బలోపేతం చేయటానికి నాయకత్వం విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. మిగిలిన వారికి తగిన పదవులు వస్తాయని, ఎవరూ అధైర్యపడ వద్దన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై వైసిపి నాయకులు విష ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని అన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ టిడిపి నాయకులంతా ఐకమత్యంగా పార్టీ ప్రతిష్ఠ నిలబెట్టే విధంగా వ్యవహరించాలని కోరారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. టిడిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎవరికి ఇచ్చిన అందరం సమన్వయంతో కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. జిల్లా అధ్యక్ష పదవి విషయంలో సిఎం చంద్ర బాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అంతిమ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఆ నిర్ణయాన్ని అందరూ గౌరవించాలని కోరారు. సమావేశంలో టిడిపి పరిశీలకులుగా వచ్చిన రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్ కర్నూల్ కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బి రామ్ భూపాల్ రెడ్డి ప్రసంగించారు. సమావేశంలో కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణ రెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శి, యర్రగొండపాలెం ఇన్‌చార్జిలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్ బాబు, టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, ఒంగోలు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు మదన్, బోడపాటి వెంకట్, మాజీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు ముత్తన శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

విద్యుత్ సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - బాపట్ల

విద్యుత్ సంస్థలో ఖాళీ పోస్టులను సీనియారిటీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులతో భర్తీ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (బి18-29), కాంట్రాక్ట్ వర్కర్స్ హెచ్-176 యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేస్తారనే ఆశతో మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అతి తక్కువ వేతనాలు, అదనపు పని గంటలు పని చేస్తున్నారని అన్నారు. సంస్థ లాభాల్లో నడవడానికి కారణమైన కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సీనియారిటీ ప్రకారం ఖాళీ పోస్టులన్నింటిని భర్తీ చేయాలన్నారు. జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కోంలలో 10 ఏళ్ల నుండి 35 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. పోస్టుల భర్తీ వయస్సు 50 ఏళ్లకు పెంచాలని కోరారు. ఎస్సీ, బీసీలకు మూడేళ్ల మినహాయింపు ఇవ్వాలని అన్నారు. అర్హత ఉన్న నాన్ టెక్నికల్ పోస్టుల్లో పీజీ, డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులతోనే భర్తీ చేయాలని అన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న పెయిడ్ హాలిడేస్ వెంటనే చెల్లించాలని అన్నారు. పెండింగ్ ఈపీఎఫ్‌ను మేనేజ్మెంట్ సరిచేయాలని అన్నారు. సర్కిల్ పరిధిలో కాంటాక్ట్ ఎంప్లాయిస్ 9నెలలపాటు పెండింగులో ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లించాలిని కోరారు. ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని అన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యలు సానుకూలంగా పరిష్కరించకపోతే భవిష్యత్తులో దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కన్వినింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన కన్వీనర్ ఎంసిహెచ్ వీరాంజనేయులు, కో కన్వీనర్లు బి సురేష్, పి సాంబశివరావు, కోశాధికారిగా ఎన్ రామానాయుడు, సభ్యులు జె రమేష్, కె వాసుదేవరావు, పి మల్లికార్జునరావు, రాజా రమేష్, డి వీరయ్య, వి వినోద్ ఎన్నికయ్యారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ సిపిడిసిఎల్ డిస్కం అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్- 176 రాష్ట్ర కోశాధికారి ఎస్ విజయ్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

ఆర్పిలకు నష్టం కలిగించే చర్యలను

ఐక్యంగా తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.వి.కొండారెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ విధానాలు ఆర్పిలకు నష్టం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.వి.కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నాడు ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా ద్వితీయ మహాసభ బి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. జి.వి. కొండారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, ఆర్పిల సమస్యలను చర్చించారు. మహాసభలో ఒంగోలు, చీమకుర్తి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ఆర్పీలు పాల్గొన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ధారా రుతమ్మ, ప్రధాన కార్యదర్శిగా నారాయణ స్వామి రాజ్యలక్ష్మి, కోశాధికారిగా పమిడి పద్మశ్రీ, సహాయ కార్యదర్శులుగా జమ్మలమడుగు సుజాత, నయోమి, ఉపాధ్యక్షులుగా పి. ఆదిలక్ష్మిని ఎన్నుకోగా, గౌరవాధ్యక్షురాలిగా జె. కల్పనను ఎన్నుకున్నారు. మొత్తం 11 మందితో జిల్లా కమిటీ రూపుదిద్దుకుంది. మహాసభలో వేతనాలు పెంచాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ యాప్‌ల శిక్షణ ఇవ్వాలని, ఆర్పీలకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మహిళా మార్ట్ డబ్బులు సభ్యులకు తిరిగి చెల్లించాలని, శ్రీనిధి డిపాజిట్లు ఇవ్వాలని, టిఎల్ఎఫ్ లెక్కలు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, రేణుక, రమణ, దివ్యశాంతి, శ్రీలక్ష్మి, చంద్రిక, భారతి, ఆదిలక్ష్మి, దుర్గ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ, రాజ్యలక్ష్మి, రూతమ్మ

ఉత్సాహంగా 'భళా గణేశా..'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిజెఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు రవిప్రియ మాల్ ఆవరణలో ఆదివారం జరిగిన 'భళా గణేశా' మట్టి వినాయక విగ్రహాల పోటీ ఉత్సాహంగా సాగింది. సుమారు 400 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. పోటీలను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఆయన సతీమణి దామచర్ల నాగసత్యలత ప్రారంభించారు. మొదటి విజేతకు రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు, ప్రోత్సాహక బహుమతులు ముగ్గురికి అందజేసి.. అభినందించారు. కార్యక్రమంలో జనసేన ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, రవిశంకర్ గ్రూప్ అధినేత, జనసేన నాయకులు కంది రవిశంకర్, సురేష్, టిడిపి నగర అధ్యక్షులు బండారు మదన్, దామచర్ల కుమార్తె దామచర్ల అనిషా లక్ష్మి, పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న జనార్ధన్, నాగసత్యలత

'పుస్తక మహోత్సవం' విజయవంతం

- అబ్బురపరిచిన విజ్ఞాన కార్యక్రమాలు
- నిర్వాహకులను అభినందించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విఎస్ఆర్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు పివిఆర్ స్కూల్ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన ఒంగోలు బుక్ ఫెస్టివల్ కార్యక్రమం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం నాడు సుమారు 50 మంది పబ్లిషర్స్, 50 వేలకు పై బడిన గ్రంధాలతో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవాన్ని 10 రోజులు పాటు విద్యార్థులు మొదలు ఉపాధ్యాయులు, పాఠకులు, కవులు, రచయితలు, మేధావులు, ప్రజాప్రతినిధులు, సాహితీ వేత్తలు, వివిధ వర్గాల ప్రజలు సందర్శించి పుస్తకాలు కొనుగోలు చేసి పఠన అభిరుచి చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన సైన్స్, విజ్ఞాన కార్యక్రమాలు, పుస్తకాలు ఆవిష్కరణ, సాహితీ కార్యక్రమాలను ఆదరించారు.

సిపిఎం నేతల అభినందనలు

చివరి రోజైన ఆదివారంనాడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, నాయకులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులుతో కలసి పుస్తక మహోత్సవాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషి విజ్ఞానం పెంపొందించుకోవడానికి పుస్తక పఠనం చాలా అవసరం అన్నారు. విజ్ఞాన దాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు.



హనుమారెడ్డి సాహిత్యంపై సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

చివరి రోజు మంచి స్పందన..

చివరి రోజు ఆదివారం కావడంతో పాఠకులు ఉదయం 10 గంటల నుంచే పీవీఆర్ బాలుర పాఠశాల మైదానానికి పోటెత్తారు. రాత్రి 9 గంటల వరకు పుస్తకాల కొనుగోలు కొనసాగింది. వచ్చే ఏడాది ఒంగోలుకు మళ్లీ వస్తామని నిర్వాహకులు ఇచ్చిన హామీతో పుస్తక మహోత్సవానికి వీడ్కోలు పలికారు.

బహుమతులు అందజేత..

పుస్తక మహెూత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు సాయంత్రం 4 గంటలకు నిర్వహించిన క్విజ్ పోటీలో బహుమతులు అందించారు. ఈ పోటీని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీకి చెందిన రహ్మానుద్దీన్ నిర్వహించారు. పది రోజుల పాటు జరిగిన పుస్తక మహెూత్సవంలో కథలు చెప్పడం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, ఏకపాత్రాభినయం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 60 మంది విద్యార్థులకు ముఖ్య అతిథి పెనుగొండ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

హనుమారెడ్డి జీవితం-సాహిత్యంపై చర్చ

సాయంత్రం 6 గంటలకు ప్రముఖ కవి హనుమారెడ్డి జీవితం–సాహిత్యం అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య తదితరులు వక్తలుగా పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ముగిసిన పుస్తక మహెూత్సవం

మూడవ ఒంగోలు పుస్తక మహెూత్సవం ముగింపు సభ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైంది. ఈ సభకు జనవిజ్ఞానవేదిక సీనియర్ నాయకులు ఏ వి పుల్లారావు అధ్యక్షత వహించారు. ముగింపు ప్రసంగాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక అధ్యక్షులు వల్లూరు శివప్రసాద్ అందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదికకు చెందిన ప్రకాశ్, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ తరఫున సాహిత్య కార్యక్రమాల నిర్వాహకులు రహ్మానుద్దీన్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 25న సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓట్ల దొంగ.. సీట్లు దొంగ.. గద్దె దిగు..' అనే నినాదంతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని.. విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు

డి3 పరిధిలో సోమవారం కరవది బజార్, చక్కనయ్య బజార్, యాదవుల బజార్, కృష్ణ మందిరం స్ట్రీట్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

● రూ.3 లక్షల నగదు, ఆటో స్వాధీనం ● వివరాలు వెల్లడించిన డిఎస్పి ఎండి మోయిన్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని అక్కయ్యపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో బంగారం పేరుతో రూ.4లక్షలు దోచుకెళ్లిన ఘటనలో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చీరాల డిఎస్పి ఎండి మోయిన్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ నందు ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లక్ష్మీపురంకు చెందిన మల్లి అలియాస్ ముంగా అలియాస్ మల్లెల రాజేష్ అతని ముఠా సభ్యులైన కావటి నాగరాజు, అన్నారెడ్డి ఇంద్ర అలియాస్ బబ్లు, మల్లి అలియాస్ ముంగా అలియాస్ మల్లెల మౌనిక అలియాస్ మానిశ, చిన్నబోతుల చంటి విజయవాడకు చెందిన ఎస్‌వీఆర్‌ఎస్‌కె గోల్డ్ లిమిటెడ్ అనువారు సోషల్ మీడియాలో బంగారం బ్యాంకులో తాకట్టు ఉంటే తాము వాటిని విడిపించి మార్కెట్ రేట్ ప్రకారం కొనుగోలు చేసి తమ కమిషన్ తీసుకొని మిగిలిన డబ్బులు ఇస్తామని పేర్కొన్న ప్రకటన చూసి సదరు వ్యక్తులను మోసం చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో విజయవాడకు చెందిన రెహమాను అనే వ్యక్తిని చీరాలకు పిలిపించారు. రూ.4లక్షల బంగారం బ్యాంక్ ఆఫ్ బరోడాలో తాకట్టు ఉందని, విడిపించి డబ్బులు ఇవ్వాలని నమ్మబలికారు. ఆ వ్యక్తిని మండలంలోని లక్ష్మీపురంలోని మల్లెల రాజేష్ ఇంటి వద్దకు తీసుకొని వెళ్లి కత్తులతో భయపెట్టి అతని వద్ద ఉన్న రూ.4 లక్షలు, అతని జోబులో ఉన్న రూ.4 వేలు, అతని శ్యాంసంగ్ కంపెనీ మొబైల్ తీసుకొని అతన్ని చంపటానికి కత్తితో ప్రయత్నించారు. అయితే రెహమాను తప్పించుకునే ప్రయత్నంలో అతని నుదిటిపైన గాయమైంది. చీరాల గవర్నమెంట్ హాస్పిటల్లో చేరి ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా వేటపాలెం పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. ఎస్పి తుషార్ డూడి సూచనల మేరకు డిఎస్పి ఎండి మోయిన్ ఆధ్వర్యంలో చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ పి జనార్ధనరావు, పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ.3లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ నేరాలకు ఉపయోగించిన ఆటో, కత్తులను, బాధితుని మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐ శేషగిరిరావు, ఎస్ఐ పి జనార్ధనరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి ఎండి మోయిన్

బిలాస్‌పూర్ రైలులో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - బాపట్ల

బిలాస్ పూర్ నుండి తిరుపతి వెళుతున్న రైలులో ఈగల్ పోలీస్ టీం జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. రైలులో సోదాలు చేశారు. సోదాల్లో 8.10కిలోల గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ తుషార్ డూడి సూచనల మేరకు మాదకద్రవ్యాల తనిఖీల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్లో బిలాస్ పూర్ నుండి తిరుపతి ప్రయాణిస్తున్న 17481 నెంబరు రైలులో బాపట్ల నుండి చీరాల వరకు నిర్వహించిన తనిఖీలు చేశారు. తనిఖీల్లో గంజాయి పొట్లాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తనిఖీల్లో బాపట్ల ఆర్‌పిఎఫ్ ఎస్ఐ మనోజ్ కుమార్‌రెడ్డి, బాపట్ల పట్టణ ఎఎస్ఐ నరసింహమూర్తి, పోతురాజు, చంద్రమౌళి, తిరుపతమ్మ, చీరాల జిఆర్పి ఎస్ఐ కొండయ్య, ఎఎస్ఐ కె శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగార్జున, చీరాల ఆర్పిఎఫ్ శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిఆర్పి కానిస్టేబుల్ దేవమ్మ, స్వప్న, జెబి రమణ, డాగ్ స్క్వాడ్ టీం, ఈగల్ టీం దుర్గాప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈగల్ టీం పోలీసులు

జిల్లా తరలివెళ్లాక పదవిలో లేకపోతే ఏంటి?

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల జిల్లా తరలి వెళ్లిన తర్వాత శాసన సభ్యులుగా వేగేశన నరేంద్ర వర్మ పదవిలో ఉంటే ఏంటి? లేక పోతే ఏంటని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి ప్రశ్నించారు. తన ఛాంబర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాల అంశం కదిలించి చింది టిడిపినే కదా అన్నారు. వైసిపి వాళ్లు ఆ వదంతులు సృష్టించార నడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా ఇచ్చింది, తెచ్చింది వైసిపి ప్రభుత్వంలో తామే కదా అన్నారు. బాపట్ల జిల్లా తరలిపోతే పదవిని వదిలేస్తానని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తాజాగా ప్రకటన చేయడం పట్ల కోన రఘుపతి స్పందించారు. ఒకవైపు చీరాల జిల్లా కేంద్రం కావాలని కౌంటర్ ఇస్తుంటే బాపట్ల అధికార టిడిపి నాయకులు ఎవరైనా స్పందిస్తారని చూశానని, ఎవరు స్పందించలేదని అన్నారు. బాపట్ల ప్రాంత ప్రజలకు జిల్లా భరోసా కల్పించలేదని అన్నారు. ప్రజలు ఎంతోమంది తనకు ఫోను చేసి బాపట్ల జిల్లా కేంద్రం తరలిపోతుందని ఆందోళన చెందుతున్నారని అన్నారు. తాము ఒక బాధ్యత గల ప్రతిపక్షంగా మాట్లాడుతు న్నామని అన్నారు. బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడలేక పోతున్నారని అన్నారు. పిపిపి పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే వైద్య కళాశాల నిర్మించాలని అన్నారు. బాపట్ల అభివృద్ధిలో అంతర్భాగమైన మెడికల్ కళాశాల నిర్మాణం అంశంపై శాసన సభ్యులు నరేంద్ర వర్మ స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. మెడికల్ కళాశాల విస్మరిస్తే బాపట్ల ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా మెడికల్ కళాశాల నిర్మించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. సూర్యలంక అభివృద్ధికి విడుదలైన రూ.98 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధికి సంబంధించి డిపిఆర్ ప్రకటించాలని కోరారు. వికలాంగుల పింఛన్ల తొలగింపునకు నిరసనగా వెళ్లిన చల్లా రామయ్య సెల్ టవర్ ఎక్కితే దించే ప్రయత్నం చేసిన వైసిపి నాయకులపై కేసులు పెట్టడం మంచి సాంప్రదాయం కాదన్నారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో ఎఎంసి మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, జోగి రాజా, చేజర్ల నారాయణరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు మర్రిప్రోలు ఏడుకొండల రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి


వరప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దేశ భవిష్యత్తు మార్చే స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - బాపట్ల

బాల్యం నుండే ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో ఇంజనీర్లు, శాస్త్రవేత్తలుగా దేశ భవిష్యత్తును మార్చే స్థాయికి ఎదగాలని హైదరాబాద్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం మిస్సైల్ సెంటర్ డిఆర్‌డిఓ విశ్రాంత శాస్త్రవేత్త అందె మురళి వరప్రసాద్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మండలంలోని జమ్ములపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిస్సైల్ రంగంలో దేశానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన అబ్దుల్ కలాం ఇచ్చిన సందేశాన్ని సాకారం చేసేందుకు ప్రతి విద్యార్థి కలలు కనాలన్నారు. తల్లి, తండ్రులు, ఉపాధ్యాయులు, దేశాన్ని గౌరవిస్తానని ప్రతిజ్ఞ బూనాలన్నారు. ధైర్యంతో కష్టపడి ఇష్టంగా పని చేసే గుణంతో పాటు దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. పాఠశాల గ్రంథాలయానికి డాక్టర్ అబ్దుల్ కలామ్, ప్రపంచ ప్రఖ్యాత లెదర్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పుస్తకాలను వరప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వివి కృష్ణారావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పంగులూరి హరిప్రసాద్, రాష్ట్ర హేతువాద సంఘం నాయకులు కరణం రవీంద్రబాబు, పువ్వాడ బసంత కుమార్, వంకాయలపాటి హరిబాబు, పిఈటి వీర చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్ర శేఖర్ నాయుడు

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చీరాల

ఎరువులు ఎమ్మార్పి ధరలకన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తహశీల్దారు గోపికృష్ణ, ఎఒ నిర్మలాదేవి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, విక్రయ రసీదులు పరిశీలించారు. ఎరువుల ధరలపై వివరాలు సేకరించారు. రైతుల ప్రయోజనాలకే ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎరువుల కొరత లేకుండా అవసరమైనంత సరఫరా జరుగుతుందని చెప్పారు. ఎరువుల విషయంలో అక్రమాలు జరగకుండా నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.


తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రేపల్లె: పట్టణం, ఇసుకపల్లి పరిధిలోని ఎరువుల దుకాణాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్‌మెంట్ టీం వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ అద్దేపల్లి లక్ష్మి మాట్లాడుతూ రైతులు అపోహతో ఒక పంటపై వేసే మూడు డోస్‌లకు సరిపడ ఎరువులు ముందే తీసుకెళ్లడం ద్వారా కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయన్నారు. ఎవరైతే యూరియా అధిక ధరకు విక్రయిస్తారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ మహేష్ బాబు, ఆర్ఐ రాంబాబు, పోలీసు కానిస్టేబుల్ బుజ్జి, పిఎసిఎస్ ఇంచార్జ్ నాగజ్యోతి పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన హెచ్ఎంల కార్యవర్గ సభ్యులు

హెచ్ఎంల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన అధ్యక్షులు కెవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వివి కృష్ణారావు ఎన్నికైనట్లు తెలిపారు. ఆర్థిక కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్లు పిడపర్తి పేరిరెడ్డి, మొలబంటి వెంకటేశ్వర్లు, నిరీక్షణరావు ఎన్నిక జరిగినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా


కలెక్టర్ జె వెంకట మురళి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్ తోపాటు ప్రతి మండల స్థాయిలోని రెవెన్యూ కార్యాలయం, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని తెలిపారు. దీనితో పాటుగా అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్ లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వివరాలు తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - యద్దనపూడి


ఎంఎల్ఎ ఏలూరి

మండలంలోని యనమదల గ్రామానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సిఫారస్సు మేరకు 6 పనులకు రూ.20 లక్షలు మంజూరు చేస్తూ కలెక్టర్ వెంకట మురళి ఉత్తర్వులు జారీచేశారు. ఆ నిధులతో గ్రామంలో సిసి రోడ్లు, డ్రైన్లు ఇతర పనులు చేపడతారని పంచాయతీ అధికారులు, నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన శాసన సభ్యులు ఏలూరికి గ్రామ ప్రజలు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

13న లోక్ అదాలత్

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 13న కోర్టుల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె శ్యాంబాబు తెలిపారు. కోర్టుల్లో పరిష్కార దశలో ఉన్న అన్ని రకాల సివిల్, భరణం, గృహహింస, మోటార్ ప్రమాద, రెవెన్యూ, బ్యాంకు, చెక్ బౌన్స్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులతో పాటు ముందస్తు రాజీ చేసుకోదలచిన కేసులు ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయస్థానాల పరిధిలో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వివాదాలను శాంతియుతంగా రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే వాళ్లు పోలీసు అనుమతులు పొందాలని ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు. వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

గేదెలు దొంగిలించారని ఫిర్యాదు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వివిధ గ్రామాల్లో గొర్రులు, పాడి గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో తరలించుకు వెళుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల వెంపరాల గ్రామానికి చెందిన మాదాల రామకృష్ణకు చెందిన పశువుల కష్టంలో కట్టివేసిన గేదెను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు వెళ్లినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి : ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సూరేపల్లి పిఎసిఎస్ పరిధిలోని రైతులకు 2025-26కుగాను 17 మంది రైతులకు సిసి, వ్యవసాయ రుణాలు రూ.1.40 కోట్ల విలువైన చెక్కులు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు చేతుల మీదుగా ఆది వారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సొసైటీ చైర్మన్ గోవర్ధనగిరి సుధాకర్ అధ్యక్షత వహించారు. సభలో ఆనందబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సొసైటీలను నిర్వీర్యం చేసిందని అన్నారు. సొసైటీలను అడ్డగోలుగా దోసుకున్నారని ఆరోపించారు. ఆ దోపిడీ ఏ రూపంలో జరిగిందో, ఎవరెవరు దోచుకున్నారో కూడా తన దృష్టిలో ఉందన్నారు. ప్రస్తుత పాలకవర్గం సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై దృష్టి సారించి అవినీతిని వెలికి తీస్తే దానికి తన వంతు సహకారం అందించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సొసైటీల్లో గత



పంట రుణాల చెక్కులు అందచేస్తున్న ఆనందబాబు

ఐదేళ్ల రూ.కోట్ల నిధులు దోసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. పార్టీలో నిరంతరం పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. అందుకే గోవర్ధనగిరి సుధాకర్ సొసైటీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. తాను నియోజకవర్గంలో అడుగుపెట్టిన నాటి నుండి సుధాకర్ పార్టీకి కట్టుబడి ఉన్నారని, ఆయనతోపాటు తన పిల్లలు కూడా అంకితభావంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలను ఎదుర్కొని పార్టీని ముందుకు నడిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గోవర్ధనగిరి సుధాకర్, డైరెక్టర్లు పోతురాజు, సోమశేఖర్లను అభినందించారు. వేమూరు ఎఎంసి ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి భాను గంగాధర్ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ పరిధిలోని రైతులకు అన్ని విధాల మార్కెట్ కమిటీ అండగా ఉంటుందని అన్నారు. అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృత ఉందని అన్నారు. సొసైటీని బలోపేతం చేసి రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భట్టిప్రోలు పిఎసిఎస్ ఛైర్మన్ పర్చూరు రమేష్, జడ్పిటిసి తిరువీధుల ఉదయభాస్కరి, పల్లెకోన ఎంపిటిసి దున్న తిరుపతి బాబు, టిడిపి నాయకులు తూనుగుంట్ల సాయి బాబా, మోటరు పుణ్య శ్రీనివాసరావు, బాలాజీ, సొసైటీ సీఈఓ బోర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గుంతల మయమైన దేవరపల్లి రోడ్డు

అధ్వానంగా దేవరపల్లి రోడ్డు

ప్రజాశక్తి - పర్చూరు

గత కొన్ని ఏళ్లుగా ఆలనా పాలనా లేక దేవరపల్లికి వెళ్లే అర్అండ్‌బి రోడ్డు అధ్వాన్న స్థితికి చేరుకుంది. రోడ్డంతా గుంతల మయంగా మారింది. గ్రావెల్ అంతా పైకి లేవడంతో వాహనాల రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డు గుండా వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారంటే రోడ్డు ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన రైతులు పండించిన పంటల ఉత్పత్తులు తరలించడానికి దేవరపల్లి గ్రామస్తులు నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాల్సి వస్తుంది. గ్రామానికి వెళ్లడానికి ఈఒక్క రోడ్డు మాత్రమే ప్రధానంగా అందుబాటులో ఉంది. సంబంధిత అధికారులు ఈ రోడ్డు మరమ్మతుకు, రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు అసలు రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం గోతుల మయంగా మారిన రోడ్డు మరమ్మత్తులు చేస్తే ప్రజల ప్రయాణానికి బాగుంటుందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పుడు నిర్మాణం చేపట్టిన పిడుగురాళ్ల, వాడరేవు 167ఏ హైవేకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గతంలో ఈ గ్రామానికి పర్చూరు నుండి ప్రైవేటు బస్సు తిరిగేది ప్రజలకు కొంత సౌకర్యంగా ఉండేది. ప్రైవేట్ బస్సు తీసివేసి చాలా కాలమైంది. అప్పటి నుండి ఈ గ్రామంలోకి ఆర్టీసీ బస్సు లేక పోవడంతో గ్రామస్తులు వ్యయప్రయాసలకు ఓర్చి తమ సొంత వాహనాల్లో ప్రయా ణాలు సాగిస్తున్నారు. ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సే లేదంటే అతిశయోక్తి కాదు. రవాణాకు ఇబ్బంది పడుతున్న గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో దేవరపల్లి రోడ్డును బాగుపరచడంతో పాటు ఆర్టీసీ బస్సు తమ గ్రామానికి నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విజయవాడలో ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

2003 డీఎస్సీ ద్వారా ఎంపికై 2004 తర్వాత నియామక పత్రం అందుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57ని అమలు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న సోమవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 2003 డీఎస్సీ ఫోరం నేతృత్వంలో జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జడా వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు కోరారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో జయంతి సభ నిర్వహించారు. ప్రకాశం పంతులు మునిమనవరాలు కెవిఎల్ సుభాషిణి ప్రకాశం కాంస్య విగ్రహానికి పూలమాల వేశారు. తదనంతరం శ్రీ వాసవీ కల్యాణ మండపంలోని విఎన్ఎస్ వేదికపై ఇలపావులూరి శేషతల్పశాయి అధ్యక్షతన జరిగిన సభను వి కృష్ణ సుభాన్ ప్రారంభించారు. సభలో కెవిఎల్ సుభాషిణి మాట్లాడుతూ ప్రకాశం పాఠశాల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు స్వయంగా నగదు పురస్కారం చేశారు. ఊటుకూరి ఉమా, అన్నపూర్ణ విద్యార్థులకు సందేశం ఇచ్చారు. చప్పిడి వీరయ్య దంపతులు గురకాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు, కాకానిపాలెం గాడేపల్లి పద్మావతి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నగదు పురస్కారం అందించారు. రావూరి రంగయ్య, వి కృష్ణ సుభాన్, కెవి మారుతీరావు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొదటి నలభై స్థానాల్లో నిలచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థిక వితరణ చేయడం విశేషమని అన్నారు. వూటుకూరి రామకోటేశ్వరరావు, సంకా సుబ్రహ్మణ్యం, గాడేపల్లి దివాకరదత్, షేక్ మహమ్మద్ రఫీ సౌజన్యంతో మండలంలోని



ప్రకాశం పంతులుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

210మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డివిఎం సత్యనారాయణ ప్రకాశం పంతులు జీవిత విశేషాలు గుర్తు చేశారు. సభా ప్రారంభంలో ప్రకాశం మిత్ర మండలి నిర్వహించిన క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. సభకు వి రఘురామశర్మ, పసుమర్తి కోటయ్య, చుండూరి మురళీ సుధాకర్ దంపతులు, యనమండ్ర వరలక్ష్మి, పాలపర్తి జ్యోతిష్మతి, కొల్లా భువనేశ్వరి, మలాది శ్రీనివాసరావు, పంచాగ్నుల ఉదయ భాస్కర్, అనంతు నాగేశ్వరరావు, పిఎల్‌వి నరసింహారావు, లక్కరాజు శ్రీనివాసరావు, ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో హీనాకు 3వ ర్యాంకు

ప్రజాశక్తి - పర్చూరు

డీఎస్సీ 2025 ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల పరీక్ష ఫలితాలు ప్రభుత్వం విడుదల చేసింది. హిందీ విభాగంలో పర్చూరుకు చెందిన షేక్ హీన ప్రకాశం జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు, మహిళా విభాగంలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి చదువుకోవాలనే బలమైన కోరిక ఉన్నప్పటికీ తను 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నానని తెలిపారు. 10వ తరగతి తర్వాత తల్లి, దండ్రులు వివాహం చేశారని తెలిపారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్త షేక్ అలీ టైలరింగ్ వృత్తి నిర్వహిస్తున్నాడని తెలిపారు. తల్లి, దండ్రులు, సోదరుని ప్రోత్సాహంతో డీఎస్సీ పరీక్ష రాసి హిందీ విభాగంలో ర్యాంకు సాధించినట్లు సంతోషం వ్యక్తం చేశారు. సాధించాలని సంకల్పం, పట్టుదల, కష్టపడే తత్వం ఉండాలని, ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. తన భర్త ప్రోత్సాహం బాగా ఉందని వివరించారు. ఒకసారి ఇంటికి వచ్చిన స్నేహితురాలు చెప్పిన మాటలకు స్ఫూర్తి పొంది చదువు సాగించుకోవాలని నిశ్చయించుకున్నానని, హిందీ ప్రవేశ పరీక్ష రాసి హిందీ పండిట్ ట్రైనింగ్ పూర్తి చేశానని తెలిపారు. డీఎస్సీ కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి మెటీరియల్ తెప్పించుకొని ఇంటి వద్దనే సిద్ధమైనట్లు తెలిపారు. అనంతరం ఒక ప్రైవేటు పాఠశాల్లో హిందీ టీచర్ పని చేశానని తెలిపారు.



ర్యాంకు సాధించిన షేక్ హీన

ర్యాంకులు సాధించడం పట్ల ఆక్స్‌ఫర్డ్ పాఠశాల సిబ్బంది, బంధువులు, తల్లి, దండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నూతలపాడుకు చెందిన గొల్లపరెడ్డి మధుసూదనరెడ్డి జిల్లా స్థాయిలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 77.77 మార్కులతో 23వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. 15 ఏళ్ల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోసం తాను చేసి కృషి ఫలించిందని, డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాలో 14వ ర్యాంకు రావటం పట్ల ఆనందంగా ఉందని పర్చూరుకు చెందిన కొప్పుల విజయకుమార్ అన్నారు. ఉపాధ్యాయునిగా విజయం సాధించాలన్న కల నేటికి సాకారమైందని జిల్లా స్థాయి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో 72.97 మార్కులు సాధించిన పర్చూరుకు చెందిన పఠాన్ షాపియా బేగం అన్నారు. మండలంలోని ఉప్పుటూరుకు చెందిన షేక్ ఆలీముద్దీన్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 74.56 మార్కులు సాధించారు. జిల్లా స్థాయిలో 51వ ర్యాంకు ఈడబ్ల్యూఎస్‌లో 3వ ర్యాంకు సాధించారు. డీఎస్సీలో ఉపాధ్యాయుల ఎంపిక పట్ల ఎంఇఓలు ఎ శివ కోటేశ్వరరావు, వెంకట్రామయ్య అభినందించారు.



సండే ఆన్ సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ తుషార్ డూడి

సైక్లింగ్‌తో ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సైక్లింగ్ అనేది పర్యావరణ హితమైనదిగా ఉండటంతో పాటు మానసిక ఒత్తిడిని నియంత్రించడంలో, శారీరక దఢత్వాన్ని, వ్యక్తిగత ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం, చీలు రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండ్, గడియార స్థంభం సెంటర్, అంబేద్కర్ విగ్రహం వరకు సాగి తిరిగి పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రకృతితో స్నేహపూర్వకంగా ఉండే జీవనశైలి పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సైకిల్ తొక్కడం వల్ల గుండె సంబంధిత రోగాల నివారణ, మధుమేహ నియంత్రణ, ఒత్తిడిని తగ్గించడం, శరీర బరువు నియంత్రణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. స్నేహితులు, బంధువులు, ఉద్యోగస్తులు సమూహాలుగా సైక్లింగ్ చేయటం వలన వారి మధ్య ఐక్యత, భావాలు, స్నేహ సంబంధాలు మరింత మెరుగవుతాయన్నారు. వాహనాల వాడకం పెరిగిన కొద్దీ వాయు, ధ్వని కాలుష్యం, వాతావరణ మార్పులు గణనీయంగా పెరిగిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి పి విజయ సారథి, బాపట్ల డిఎస్పి జి రామాంజనేయులు, సిసిఎస్ డిఎస్పి పి జగదీష్ నాయక్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నారాయణ, బాపట్ల టౌన్ సిఐ రాంబాబు, రూరల్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సర్కిల్ సిఐ హరికృష్ణ పాల్గొన్నారు.



వైద్య శిభిరంకు హాజరైన రోగులను పరిశీలిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు రామానంద ట్రస్ట్ ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వేకువ జామునే వచ్చిన 1178 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. షుగర్ వ్యాధి బాధితులకు జాప్యం లేకుండా వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి త్వరగా పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు షుగరు వ్యాధిపై అవగాహన కల్పించారు. రోజువారీ జీవన విధానం మార్చుకోవాలని సూచించారు. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందని చెప్పారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని చెప్పారు. వైద్య శిభిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ఎదుర్కోవాలంటే..

వామపక్షాలు బలపడక తప్పదు..

- దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రం
- ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్న మోడీ
- సిపిఐ రాష్ట్ర మహాసభల్లో నేతలు..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మతోన్మాదాన్ని ఎదుర్కోవాలంటే, కార్పొరేట్ దోపిడీని అరికట్టాలంటే, రైతు-కూలీ-ఉద్యోగి సమస్యలు పరిష్కరించాలంటే వామపక్షాలు బలపడక తప్పదని పలువురు నేతలు స్పష్టం చేశారు. ఒంగోలులో ఆదివారం నాడు సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, వైసిపి ఇద్దరూ ఒకే దారిలో నడుస్తున్నారని విమర్శించారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సిపిఐ, సిపిఎం నేతలు

లౌకిక పార్టీగా చెప్పుకునే టిడిపి ఎన్‌డిఏలో చేరి మతోన్మాదానికి అండగా నిలుస్తోందన్నారు. సిపిఐ జాతీయ కమిటీ నాయకురాలు వహీదా పర్వీన్ మాట్లాడుతూ దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఉన్నాయని, వీటిని అధిగమించేందుకు వామపక్షాలు తీవ్రంగా కృషి చేయాల్సి ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల ద్వారానే వామపక్షాల బలోపేతం అవుతాయని, ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. సిపిఐ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య, మహా న్యూస్ ఎడిటర్ మారెళ్ళ వంశీకృష్ణ మాట్లాడారు. మహాసభల వేదిక (పిఎస్ జివి కన్వెన్షన్) నల్లూరి అంజయ్య ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు మతవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. జాతీయ నాయకుడు రావుల వెంకయ్య ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. రాష్ట్ర నాయకులు పి. జగదీష్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సభకు జీవీ సత్యనారాయణమూర్తి, దుర్గ భవాని, నాజర్ జీ, ఎమ్మెల్ నారాయణ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సినీ నటులు మాదాల రవి, జి. ఈశ్వరయ్య, రావుల రవీంద్రనాథ్, ఆహ్వాన సంఘ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు చంద్ర నాయక్ బృందం ఆలపించిన పాటలు, అల్లూరి బుర్రకథ అహుతులను అలరించాయి.

నేడు 'రియాజ్' ప్రమాణ స్వీకారం

- ఒడా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న జనసేన నేత..
- పాల్గొననున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) ఛైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. సోమవారం ఉదయం ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలులో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్‌కు స్వాగతం పలుకుతూ జనసేన పార్టీ నాయకులు ఒంగోలు



షేక్ రియాజ్

నగరంలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమ వేదికపై భారీ ఎల్ఈడి స్కీన్ ఏర్పాటు చేశారు. వీక్షించే వారి కోసం సైతం ఎల్ఈడీలు ఏర్పాటు చేయటం గమనార్హం. ఒడా ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు, జనసేన పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం: ఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'సండేస్ ఆన్ సైకిల్..' కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ దామోదర్ ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ మంచి వ్యాయామమని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామరెడ్డి, ఆర్ ఎస్సైలు ప్రసాద్, సురేష్,



సైక్లింగ్ చేస్తున్న ఎస్పీ దామోదర్

తిరుపతి స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల 26, 27 తేదీలలో జరగనున్న వత్తిరక్షణ, వత్తిదార్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని కాపు కళ్యాణమండపంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ప్రారంభసభ జరుగుతుందని, సభకు పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ టి.దామోదరనాయుడు, రైతుసంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి జేడీ డాక్టర్ బి.రవి, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీరామ్, కిలారి పెద్దబ్బాయి, వివిధ జిల్లాల సహకార సంఘ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి.. తీర్మానాలు చేయడం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం, కొత్త రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం మహాసభల ముఖ్య కార్యక్రమమని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయడానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి పెంపకందారులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

'మహా ధర్నా'కు యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో సోమవారం విజయవాడలో నిర్వహించనున్న చలో విజయవాడ మహాధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆదివారం నాడు పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం.57 ప్రకారం, 2004కి ముందు నియామక ప్రక్రియ ప్రారంభించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బందికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లో మహాధర్నా జరగనుంది. కార్యక్రమానికి యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతూ.. ప్రకాశం జిల్లాలోని యుటిఎఫ్ కార్యకర్తలంతా భారీ ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు సంయుక్తంగా ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.